క్లుప్తంగా

అవగాహన సదస్సుకు హాజరు కావాలి

దర్శి: మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఈ నెల 9వ తేదీన అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్ హసీనా భాను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షల్లో పాటించాల్సిన నియమాలు, పద్ధతుల గురించి ముందుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం కోసం సదస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సదస్సులో పరీక్షల్లో పాటించాల్సిన నియమాలు, పద్ధతుల గురించి అవగాహన కల్పిస్తామని తెలిపారు. అందరూ పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ కోరారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

దొనకొండ: రైతులు పండించిన మిర్చి, కంది పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాచరణ కార్యదర్శి బత్తుల వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. రూ.వేలకు, వేలు ఖర్చు చేసి మిర్చి, కంది సాగు చేశారని, కూలీ రేట్లు విపరీతంగా పెరిగాయని, తీరా గుంటూరు మార్కెట్ యార్డులో పూర్తిగా ధర పడిపోయిందని, గత 4 సంవత్సరాల్లో మిర్చి ధర కనిష్టం రూ.18 వేలు, గరిష్టం రూ.22 వేలు పలికిందని చెప్పారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. నేడు మిర్చి రూ.11 వేలకు కూడా అడిగే నాథుడే లేడన్నారు.

ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ క్లాసులు ప్రారంభం

దొనకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 2 నుంచి ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు క్లాసులు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపల్ కె.దునుమణి తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అడ్మిషన్ తీసుకోవాలన్నారు. కళాశాల ఏర్పాటు చేసి 42 ఏళ్లు కావస్తోందని, విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణులవుతున్నారన్నారు. నాణ్యమైన బోధన అందిస్తున్నామని, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉన్నాయని, ఈ ఏడాది బైపీసీ, ఎంపీసీ గ్రూపుల కోసం దరఖాస్తు చేసుకున్నామన్నారు. తమ కళాశాలలో చేరిన వారికి పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఆర్ఓ ప్లాంట్ వాటర్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లోని విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేసుకుంటున్నారని, తమ కళాశాలలో ఎటువంటి ఖర్చు లేకుండా బోధన అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని గ్రామాల్లోని విద్యార్థులు తల్లిదండ్రులు దృష్టిలో పెట్టుకుని తమ పిల్లలను కళాశాలలో చేర్పించాలని ప్రిన్సిపాల్ కోరారు.

ప్రభుత్వ సొమ్ము రికవరీ చేస్తాం

తర్లుపాడు: మండలంలో ఉపాధి హామీ పథకం పనులు, కూలీల మస్టర్‌లో అవకతవకలకు పాల్పడిన సిబ్బంది నుంచి ప్రభుత్వ సొమ్ము రికవరీ చేస్తామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జోసెఫ్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించారు. పలు గ్రామాల నివేదికలను పరిశీలించారు. కూలీల మస్టర్లలో పొరపాట్లు, హార్టికల్చర్‌కు సంబంధించి కొన్నిచోట్ల మొక్కలు లేకపోవడాన్ని గుర్తించినట్లు చెప్పారు. అవకతవకలకు పాల్పడిన సిబ్బంది నుంచి ప్రజా ధనాన్ని రికవరీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్, ఎంపీపీ భూలక్ష్మి, ఏపీఓ బుల్లెన్నరావు తదితరులు పాల్గొన్నారు.


బడికి సమీపంలో లిక్కర్ షాపు ఏంటని ప్రశ్నిస్తున్న టీడీపీ సభ్యురాలు కుమారి, సమావేశంలో బైఠాయించిన వైస్ ఎంపీపీ ఆదిశేషు

బడికి సమీపంలోనే లిక్కర్ షాప్

- హైస్కూల్లో టాయిలెట్లు లేక ఇబ్బంది పడుతున్న బాలికలు
- మండల పరిషత్ సమావేశంలో టీడీపీ ఎంపీటీసీ ఆరోపణ
- ఎంపీడీవో చర్యలకు నిరసనగా బైఠాయించిన వైస్ ఎంపీపీ

యర్రగొండపాలెం: బడికి సమీపంలో లిక్కర్ షాప్ ఏర్పాటు చేయడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అమానిగుడిపాడుకు చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు గార్లపాటి కుమారి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశానికి ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ అధ్యక్షత వహించారు. అజెండాలోని విద్యాశాఖ అంశంపై జరుగుతున్న చర్చలో ఆమె లేచి ఎస్సీపాలెం పడమటి బజారులోని ప్రాథమిక పాఠశాలకు దగ్గరలో మద్యం షాప్ నిర్వహిస్తున్నారని, బడికి వెళ్లే విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. బడి, గుడులకు దాదాపు 200 మీటర్ల దూరంలో మద్యం షాప్ ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వ నిబంధన ఉన్నా కేవలం 20 మీటర్ల దూరంలోనే ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేసుకుంటున్నారని, కొంతమంది పాఠశాల వద్దకు వెళ్లి మద్యం సేవిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. అమానిగుడిపాడులోని హైస్కూల్లో టాయిలెట్లు లేక పోవడంతో బాలికలు బహిరంగ ప్రదేశాల్లోకి వెళ్లాల్సిన గతి పట్టిందని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. గ్రామంలోని ఎస్సీ పాలెంలో దాదాపు 80 మంది 5 సంవత్సరాల లోపు పిల్లలు ఉన్నారని, 30 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నా కేవలం ఒక అంగన్‌వాడీ కేంద్రం మాత్రమే నిర్వహిస్తున్నారని, రెండో కేంద్రాన్ని ఏర్పాటు చేయమని అధికారులకు చెప్పినా వారు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే రెండో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

సమావేశంలో బైఠాయించిన వైస్ ఎంపీపీ

సమావేశం జరుగుతున్న సమయంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ మందుల ఆదిశేషును ఉద్దేశించి ఎంపీడీవో బి.శ్రీనివాసులు నీవు ఎవరు అడగటానికి.. అని అనడంతో ఆయన కుర్చీలో నుంచి కింద కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. తాను వైస్ ఎంపీపీనని, అజెండాలోని అంశాలు అడగడంలో తప్పేముందని నిలదీశారు. గత సంవత్సరం అక్టోబర్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు ఎంతవరకు పరిష్కారమయ్యాయని ప్రశ్నించారు. అందుకు ఎంపీడీవో తగిన సమాధానం ఇవ్వలేకపోయారు. ఈ సంవత్సరం జనవరిలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఎందుకు వాయిదా వేశారని, సభను వాయిదా వేయాల్సిన అవసరం ఏముందన్నారు. గ్రామ సభలకు స్థానిక ప్రజాప్రతినిధులను పిలువకుండా తమకు నచ్చిన వార్డు సభ్యుడిని కూర్చోబెట్టుకొని సమావేశాలు నిర్వహించుకుంటున్నారని, ఆయనతో పాటు పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆరోపించారు. సభను అడ్డుకుంటే చర్య తీసుకోవాల్సి వస్తుందని ఎంపీడీవో సభ్యుడిని ఏకవచనంతో మాట్లాడారు. దీంతో వారిద్దరి మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. ఎంపీడీవోకు మద్దతుగా పలువురు టీడీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు నిలిచారు. నియోజకవర్గంలో మంత్రి పర్యటన ఉండటంతో సర్వసభ్య సమావేశానికి తాను హాజరు కాలేక పోయానని, ఇతర శాఖలకు చెందిన అధికారులపై తన అజమాయిషీ లేదని ఎంపీడీవో అన్నప్పటికీ సభ్యులు సంతృప్తి చెందలేదు. ఎంపీపీ కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత తమ అందరిపై ఉందని, సమావేశంలో ఏం జరుగుతుందన్న విషయాన్ని కూడా వారు గమనిస్తుంటారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా పనిచేసి మండల అభివృద్ధికి పాటుపడదామని పేర్కొన్నారు. ఎంపీపీ రూ.46 లక్షలతో ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. తమ్మడపల్లి ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మిరెడ్డి, మొగుళ్లపల్లి సర్పంచ్ కె.వెంకటేశ్వరరెడ్డి పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో పీఆర్ డీఈఈ వెంకటేశ్వరరెడ్డి, ఉద్యాన, వ్యవసాయాధికారులు ఆదిరెడ్డి, శేషిరెడ్డి, మాల్యాద్రిరెడ్డి, ఏపీవోలు కె.నాగేశ్వరరావు, ఎం.శైలజ, ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లూ నాయక్, వైద్యాధికారులు కోటా నాయక్, మంత్రూ నాయక్ పాల్గొన్నారు.

అర్హులకు సబ్సిడీ రుణాలు అందేనా?


పెద్దారవీడు మండల ప్రజా పరిషత్ కార్యాలయం


పెద్దారవీడు: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పలు కార్పొరేషన్ల ద్వారా అర్హులకు సబ్సిడీ రుణాలు అందే పరిస్థితి కనిపించడం లేదు. మండలానికి తక్కువ యూనిట్లు మంజూరు చేశారు. దరఖాస్తులు మాత్రం భారీగా వచ్చాయి. ప్రతి గ్రామంలో సబ్సిడీ రుణాలకు డిమాండ్ పెరిగింది. ప్రతి యూనిట్‌కు ప్రభుత్వం 50 శాతం రాయితీ, లబ్ధిదారులు 50 శాతం బ్యాంకుకు చెల్లించాలి. గ్రామాల వారీగా ఈబీసీలకు 11 యూనిట్లకు రూ.20 లక్షలు, బీసీల్లో కుమ్మరి, మేదర, శాలివాహన వారికి మండల పరిధిలో రెండు యూనిట్లకు రూ.6 లక్షలు, కాపులకు మండల పరిధిలో 4 యూనిట్లకు రూ.13 లక్షలు, గ్రామాల వారీగా బీసీలకు 21 యూనిట్లకు రూ.40 లక్షలు మంజూరైనట్లు ఎంపీడీఓ జాన్‌సుందరం వివరించారు. వివిధ కార్పొరేషన్ల రుణాల కోసం మండల పరిధిలో మొత్తం 378 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, వారికి మార్చి 20, 21, 22 తేదీల్లో ఇంటర్వ్యూలు చేశారని పేర్కొన్నారు. లబ్ధిదారుల జాబితాను ఆయా బ్యాంకులకు పంపినట్లు సమాచారం. రుణాలు మంజూరు చేయడంలో పక్కా రాజకీయం నడిచింది. టీడీపీ నాయకులు చెప్పిన వారికే రుణాలు మంజూరు చేస్తున్నారని సామాన్య ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమకు మండల నాయకులు మద్దతు ఇవ్వలేదని మరో వర్గం నాయకులు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టీడీపీలో తమ వర్గానికి రుణాలు ఇవ్వలేదని, మరో వర్గానికి రుణాలు ఇచ్చారని వాట్సప్‌ల్లో ప్రచారం జరుగుతోంది. రుణాల పంచాయతీ విషయం నియోజకవర్గ టీడీపీ నాయకుని దృష్టికి తీసుకెళ్లాలని ఒక వర్గం నాయకులు చర్చించుకుంటున్నారు. అర్హులకు రుణాలు ఇవ్వడం లేదని, టీడీపీ నాయకులు ఎవరికి చెబితే వారికే రుణాలు మంజూరు చేసేలా ఉందని దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యువకులకు ఉద్యోగం ఎలానూ కల్పించడం లేదు. సబ్సిడీ రుణాలు మంజూరైతే ఏదో ఒక వ్యాపారం చేసుకొని జీవనం సాగిద్దామని ఆశించిన నిరుద్యోగులకు చుక్కెదురైంది. కొంత మంది తమ పేర్లు ఎంపిక చేయాలని టీడీపీ నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇదే అదునుగా గ్రామాల్లో టీడీపీ నాయకులు రుణాలు మంజూరు చేయిస్తే మాకేంటి అంటూ పైరవీలు సాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజల సమస్యలపై దృష్టిసారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

గిద్దలూరు రూరల్: ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ కడప లక్ష్మి అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో పని చేయాలని కోరారు. ప్రధానంగా ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ కావడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మండలంలో ప్రస్తుతం 7 హైస్కూల్స్ ఉన్నాయని కొత్తగా మరో 3 హైస్కూళ్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బి.నోవెల్, బత్తెం రాజమ్మ, ఎంపీడీఓ డి.వి.రమణారెడ్డి, ఏఓ విజయభాస్కర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ నారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని, పంచాయతీరాజ్ ఏఈ సుబ్బారావు, ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోతి, ఏపీఓ రమణి, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అధ్వానంగా సి.కొత్తపల్లి రోడ్డు


నీటితో నిండి ఉన్న సి.కొత్తపలి రోడ్డు

పుల్లలచెరువు: మండలంలోని చాపలమడుగు నుంచి సి.కొత్తపల్లి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. కొన్నేళ్లుగా తట్ట మట్టి కూడా వేయక పోవడంతో రోడ్డు గుంతలమయమైంది. చాపలమడుగు పంచాయతీలోని సి.కొత్తపల్లిలో దాదాపు 300 కుటుంబాలు ఉంటాయి. గ్రామంలోని ప్రజలు నిత్యం పంచాయతీ కేంద్రమైన చాపలమడుగుకు ఒకటిన్నర కిలో మీటర్ రావాల్సిందే. అలాగే ఈ గ్రామ ప్రజలు నిత్యం మండల కార్యాలయాలకు పనుల కోసం మండల కేంద్రమైన పుల్లలచెరువు, దాని దగ్గరలో ఉన్న యర్రగొండపాలెం పట్టణానికి వివిధ పనుల కోసం వెళ్తుంటారు. అధ్వానంగా ఉన్న రహదారిపై ప్రయాణించడం తీవ్ర ఇబ్బందికరంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. గతంలో ఈ రహదారిపై తారు రోడ్డు వేసేందుకు చిప్స్ పరిచారు. వివిధ కారణాలతో రహదారి పనులు ఆగిపోయాయని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో ఇప్పటి వరకు పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి రహదారి మొత్తం నీరు నిలిచి బురదమయంగా మారింది. ప్రస్తుతం ఈ రహదారిపై ప్రయాణించడం వాహన చోదకులకే కాదు పాదాచారులకు సైతం తీవ్ర ఇబ్బందికరంగా మారింది. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని తారు రోడ్డు నిర్మించాలని సి. కొత్తపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

పోతంపల్లి చెరువు కట్ట గండి పూడ్చివేత


పోతంపల్లి చెరువు కట్ట గండి పూడ్చేందుకు తెచ్చిన పొక్లెయిన్

పెద్దారవీడు: మండలంలో రేగుమానిపల్లి పంచాయతీ పోతంపల్లి సమీపంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి చెరువు కట్టకు పడిన గండిని శుక్రవారం పూడ్చి వేశారు. గ్రామాల్లో రాత్రి మంచి వర్షం కురవడంతో చెరువుకు బాగానే నీరు చేరింది. చెరువు కట్టకు రంధ్రం పడటంతో నీరు వృథాగా పోయింది. ఉదయం చెరువు కట్టకు గండి పడి నీరు వృథాగా పోతోందని ఇరిగేషన్ అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించారు. అయినా వారు రాకపోవడంతో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ దుద్దెల వెంకటరెడ్డి స్పందించి వెంటనే పొక్లెయిన్ పిలిపించారు. గండి పడిన ప్రదేశాన్ని గుర్తించి నీరు వృథా కాకుండా రంధ్రాన్ని పూడ్పించారు. చెరువు కట్టకు నీరు వృథా పోకుండా పొక్లెయిన్ సాయంతో గండికి మట్టి పోసి పూడ్చటంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కొద్ది సేపటి తర్వాత ఇరిగేషన్ శాఖ అధికారి పోలురాజు చెరువు వద్దకు వచ్చి కట్టను పరిశీలించి పూర్తిగా నీరు పోకుండా గండిని పూడ్పించారు. చెరువులో నీరు నిల్వ ఉండటంతో, పశువులకు, ప్రజలకు తాగునీటి ఎలాంటి ఇబ్బందులు ఉండవని గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


పూర్ణచంద్రరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కురిచేడు: మండలంలోని పడమర వీరాయపాలెం ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం పచ్చా పూర్ణచంద్రరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వార్షిక నివేదికను ఆయన చదివి వినిపించారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ చదువు ప్రాముఖ్యతను వివరించారు. విద్య అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం త్వరలో ఉద్యోగ విరమణ చేయబోవుతున్న హెచ్‌ఎం పూర్ణచంద్రరావును, ముఖ్య అతిథిగా హాజరైన కురిచేడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం మాధవిలను ఘనంగా సన్మానించారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌వలి, ఏపీటీఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజారహంతుల్లా, జిల్లా కార్యదర్శి సీహెచ్ శివరామకృష్ణ, ఎస్‌ఎంసీ చైర్మన్ కోటేశ్వరరావు, ఎంఆర్‌జీ షేక్ మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

త్రిపురసుందరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు


అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పెద్దారవీడు: శ్రీ బాలాత్రిపుర సుందరిదేవి ఆలయంలో వసంత నవరాత్రుల సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకం అమ్మవారి ఆలయంలో ఉగాది పండగ నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీచక్రం వద్ద దంపతులు కుంకుమార్చన పూజలు చేశారు. ఉభయదాతలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేద పండితులు వేద ఆశీర్వచనం, ప్రసాదాలు పంపిణీ చేశారు.


రైస్‌మిల్లులో పట్టుకున్న రేషన్ బియ్యం బస్తాలు

పేదల బియ్యం.. పక్కదారి!

బేస్తవారిపేట:

అధికార పార్టీ నేతల ధన దాహం తీరడంలేదు. సహజ వనరులైన ఇసుక, గ్రావెల్ దందాతో దండిగా సంపాదిస్తున్న కూటమి నాయకులు పేదల కడుపులు కొట్టి మరీ జేబులు నింపుకొంటున్నారు. అక్రమార్కులు నిత్యం రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ తరలిస్తున్నప్పటికీ స్థానిక అధికారులు నెలవారీ వాటాలు పుచ్చుకుంటూ నిద్ర నటిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బియ్యం అక్రమ రవాణాపై అధికారులకు సమాచారం ఇచ్చినా భారీగా మామూళ్లు అందుతుండటంతో కనీస స్పందన ఉండటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

జోరుగా అక్రమ దందా

ఒంగోలు–నంద్యాల హైవేరోడ్డు పక్కన చెట్టిచర్ల సమీపంలోని రైస్‌మిల్లులో గత ఏడాది ఆగస్టు నెలలో అక్రమంగా 253 బస్తాల రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచారు. సమాచారం అందుకున్న ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ క్రిష్ణమోహన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. రైస్‌మిల్లు యజమానిపై 6ఏ కేసు నమోదు చేశారు. నేడు ఇదే రైస్ మిల్లులో రేషన్ బియ్యం రీసైక్లింగ్ జరుగుతుంది. గత ఏడాది అక్టోబర్ నెల 24వ తేదీన సబ్‌కలెక్టర్ అర్ధరాత్రి కంభంలో 600 బస్తాల రేషన్ బియ్యం లోడుతో వెళ్తున్న లారీని పట్టుకున్నారు. తాజాగా అదే రైస్ మిల్లు నుంచి 300 క్వింటాళ్ల పాలిష్‌డ్ రేషన్ బియ్యం లారీని సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ సీజ్ చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా ఏరకంగా సాగుతుందో ఈ సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి

బేస్తవారిపేటలోని ఓ రైస్‌మిల్లుకు..

గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో కార్డుదారుల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని రాత్రి వేళ బేస్తవారిపేటలోని హైవేరోడ్డు పక్కన ఉన్న ఓ రైస్ మిల్లుకు తరలిస్తున్నారు. మిల్లులో రీసైక్లింగ్ చేసి వేరే బ్యాగుల్లోకి మార్చి నెల్లూరు, కాకినాడ, తమిళనాడు పోర్టులకు తరలిస్తున్నారు. బేస్తవారిపేట నుంచి ప్రతి రోజూ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పదుల సంఖ్యలో లారీల్లో అక్రమంగా రేషన్ బియ్యం తరలివెళ్తున్నా పట్టించుకోవడంలేదు.

ప్రత్యేక టీమ్‌ల ఏర్పాటు

ప్రతి నెలా రేషన్ డీలర్ల వద్ద, కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేయడంతోపాటు వాటిని బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు ప్రత్యేకంగా ఓ బృందం అధికార పార్టీ ముఖ్యనేత కనుసన్నల్లో పనిచేస్తున్న విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏకంగా సివిల్ సప్లయిస్ గోడౌన్ నుంచే నేరుగా బ్లాక్ మార్కెట్‌కు బియ్యం తరలించే స్థాయికి అక్రమార్కులు ఎదిగిపోయారనే చర్చ జోరుగా నడుస్తోంది. కార్డుదారుల నుంచి కేజీ బియ్యాన్ని రూ.12 చొప్పున కొంటున్న మాఫియా అదే బియ్యాన్ని రూ.35 నుంచి రూ.40కు విక్రయిస్తున్నట్లు సమాచారం.

కార్డుదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని ప్రత్యేక బృందాలు చెప్పిన ధరకు అమ్మాలి, అలా కాదని ఇతరుకు విక్రయిస్తే వెంటనే అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తారు. తద్వారా బయట ప్రాంతాలకు బియ్యం తరలిపోకుండా, తాము సూచించిన వారికే చేరేలా టీడీపీ నేతల బృందం పూర్తి స్థాయిలో కట్టడి చేస్తోంది. వీరికి గతంలో కిలో బియ్యానికి ఎంతో కొంత ఇచ్చేవారు. వారికి మండలాల్లో కొన్ని పంచాయతీలను కేటాయించి బియ్యం సేకరించేవారు. తక్కువ బియ్యం వచ్చినప్పుడు ఆదాయం సరిపోకపోవడంతో వారిలో వారికే మనస్పర్థలు వస్తున్నాయి. వ్యతిరేకత పెరుగుతుండటంతో నేడు నెలకు స్థాయిని బట్టి రూ.25 వేల నుంచి రూ.50 వేలు ఇస్తున్నారు. ఇదిలా ఉండగా కొన్ని చోట్ల డీలర్లు కొనుగోలు చేసి అమ్ముతుండటం గమనార్హం.

శ్రీరాముడికి వెండి గొడుగు, మకర తోరణం


మకర తోరణం గ్రామోత్సవం

పొదిలి: స్థానిక విశ్వనాథపురం కాలేజీ రోడ్డులో సీతారామచంద్ర స్వామి ఆలయానికి దాతలు మకరణ తోరణం, వెండి గొడుగు తయారు చేయించారు. ఆలయ ధర్మకర్త పోలిరెడ్డి ఆధ్వర్యంలో మకర తోరణం, వెండి గొడుగును దాతల గృహాల నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. మేళ తాళాలు, వేద మంత్రాల నడుమ స్వామి వారికి అలంకరించి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సామి రాజా, సుబ్రమణ్యం(శివ), కోటేశ్వరరావు, సూరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పట్టాభి రామస్వామి ప్రతిష్ట మహోత్సవం

- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు హాజరు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని రామాంజనేయ నగర్‌లో పట్టాభి రామస్వామి దేవస్థానంలో శుక్రవారం గణపతి సహిత సీతా లక్ష్మణ రామచంద్రుడి విగ్రహాల ప్రతిష్ట, నూతన ధ్వజ స్తంభం, మహా కుంభాభిషేక ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూజల్లో మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనకు ఘన స్వాగతం పలికి పూజలు చేయించారు. అనంతరం అన్నా రాంబాబును ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, బార్ అసోషియేషన్ అధ్యక్షులు భూపని కాశయ్య, శివరాంపురం సర్పంచ్ బ్రహ్మం పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న అన్నా రాంబాబు